## హనుమనపల్లి వంకలో ఇసుక మాయం

**అగళి, నవంబర్ 9 ప్రభాతవార్త :** మండల పరిధిలోని హనుమనపల్లి సమీపంలో ఉన్న వంక ద్వారా కొందరు స్వార్థ పరులు అందులోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానికంగా ఉండేవారు ఇళ్ల నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి ఎద్దుల బండ్ల ద్వారా ఇసుకను తోలుకోవచ్చని, దీనికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తోలుకోవడానికి రీచ్‌లను గుర్తించ లేదు. నిర్మాణాలన్ని సజావుగా సాగకుండా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇళ్లు, మరుగుదొడ్లునిర్మించుకుంటున్న పేదలు ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను తీసుకుంటున్నారు. కానీ హనుమనపల్లి ప్రాంతంలో ఇటీవల కురిసిన ప్రాంతానికి ఎగువ ప్రాంతం నుంచి ఇసుక రావడంతో అక్కడి ఇసుక నిల్వ ఉంది. దీనిపై కన్నేసిర కొందరు స్వార్థపరులురాత్రి వేళల్లో వంకలో ట్రాక్టర్లకు ఇసుకను నింపి కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్నారని ఈ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఆటో బోల్తాపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

### -మాళాపురం గ్రామంవద్ద ఘటన



తీవ్రంగా గాయపడిన గోపాల్‌నాయక్

**ఉరవకొండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** ఉరవకొండ రూరల్ సర్కిల్ పరిధిలోని విడపనకల్లు మండలం మాళాపురం గ్రామంవద్ద బుధవారం మధ్యాన్నం ఆటో బోల్తాపడి జరిగిన ప్రమాదంలో చాపిరి తాండాకు చెందిన గోపాల్‌నాయక్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించగా అది సరైన సమయానికి ఘటనా స్థలానికి చేరుకోకపోవడంతో పోలీసుల చొరవతో స్థానికులు మరొక వాహనంలో అతన్ని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం గోపాల్‌నాయక్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కలెక్టర్ పట్ల జె.సి.ప్రభాకర్‌రెడ్డి దురుసు ప్రవర్తన గర్హనీయం

### -గ్రామ, వార్డు సచివాలయాలవద్ద నల్లబ్యాడ్జీలతో సిబ్బంది నిరసన



రాయంపల్లి గ్రామ సచివాలయం ముందు నల్లబ్యాడ్జిలతో సిబ్బంది నిరసన

**ఉరవకొండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** సోమవారం జిల్లా కేంద్రం అనంతపురంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పట్ల తాడిపత్రి మున్సిపల్ ఛైర్మెన్ జె.సి.ప్రభాకర్‌రెడ్డి ప్రవర్తించిన తీరు గర్హనీయమని సచివాలయాల ఉద్యోగులు వాపోయారు. జె.సి అనుచిత ప్రవర్తనను ఖండిస్తూ బుధవారం మండల వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ముందు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మండల పరిధిలోని రాయంపల్లి, వెలిగొండ, రాకెట్ల, చిన్నముష్టూరు సచివాలయాలతోపాటు పట్టణంలోని పట్టణంలోని 2,4,5 వార్డు సచివాలయాల ముందు సిబ్బంది నిరసన కొనసాగించారు.

## డ్రైవర్స్, ఎస్ఎల్ఎన్ కాలనీల్లో ప్రతి ఇంటిముందు ఇంకుడు గుంతలు

### -రోడ్లపైకి మురికినీరు వదలకుండా ఏర్పాటు చేయించిన పంచాయతీ కార్యదర్శి-ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రత్యేక చొరవతో కొనసాగిన కార్యక్రమం



డ్రైవర్స్ కాలనీలో ఇంటిముందు ఇంకుడు గుంతను తవ్విస్తున్న పంచాయతీ కార్యదర్శి కె.గౌస్ సాహెబ్

**ఉరవకొండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** పట్టణంలోని డ్రైవర్స్, ఎస్ఎల్ఎన్ కాలనీల్లో ప్రతి ఇంటి ముందు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. ఆయా కాలనీల్లోని రోడ్లపైకి మురికినీరు చేరుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతుండటంతోపాటు ఆపరిశుభ్రత ఏర్పడుతున్న విషయాన్ని స్థానిక వైసీపీ నాయకులు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మేజర్ గ్రామ పంచాయతీ అధికారులకు ఆదేశించారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.గౌస్ సాహెబ్ సిబ్బందితో కలిసి ఆయా కాలనీల్లో పర్యటించి ప్రతి ఇంటి ముందు కార్మికులతో ఇంకుడు గుంతను తవ్వించారు. మురికినీటిని రోడ్లపైకి వదలకుండా ఇంకుడు గుంతల్లోనే వదలాలని రోడ్లపైకి వదిలిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేశారు. త్వరలోనే డ్రైనేజీ సమస్యకు పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యుడు ముష్కిన్‌సాబ్, వైసీపీ నాయకులు అర్కెట్ జిలాన్, ఆరే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రాకెట్ల పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్

### -గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ పావని



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పావని

**ఉరవకొండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాకెట్ల పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమం జరిగింది. పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ పావని గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించగా సిబ్బంది వారికి మధుమేహం, హెచ్‌ఐవీ, రక్తహీనత, ఎత్తు, బరువు తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు పావనితోపాటు సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.యండి.షఫీ, సూపర్‌వైజర్ శ్రీధరమూర్తి, స్వర్ణలత గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వ్యక్తిగత శుభ్రత, పోషకాహారం, పోలిక్ యాసిడ్ మాత్రల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గర్భవతులు తప్పకుండా అయోడిన్ కల్గిన ఉప్పునే వినియోగించాలని క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకొంటూ కాన్పుకోసం ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని సూచించారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకొని భ్రూణ హత్యలకు పాల్పడటం చట్టరిత్యా నేరమని వివరించారు. గర్భవతులకు నూతనంగా నియమితులైన వైద్యులు డాక్టర్ వెంకటేష్‌నాయక్ భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్టపర్తిలో జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్

**పుట్టపర్తిరూరల్, నవంబర్ 09; ప్రభాతవార్త :** భగవాన్ శ్రీసత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకొని శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ఈ నెల 12, 13 తేదీలలో జిల్లా స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సామకోటి శివయ్య, పివి.రమణారెడ్డి, ప్రకాష్ రెడ్డి, కైలాష్‌లు తెలియజేశారు. ఈ టోర్నీలో సింగిల్స్ మరియు డబుల్స్ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మంచి ప్రైజ్ మనీతో పాటు, మెమొంటోలు ప్రదానం చేయడం జరుగుతుందని, ఆసక్తికలిగిన వారు శుక్రవారం 10 గంటలలోపు తమ టీం వివరాలను, పేర్లు, ఆధార్ కార్డుతో సహాఫోన్ 8897170589,9959249575 నెంబర్లకు పంపాలని కోరారు.

## పెన్నహోబిళంలో వీరసింహారెడ్డి సినిమా చిత్రీకరణ..!

### -నేడు, రేపు ఆమిద్యాల, రాకెట్లలో షూటింగ్



బాలబాలికలపై సన్నివేషాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో బుధవారం హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ హీరో నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 107 చిత్రం వీరసింహారెడ్డి షూటింగ్ కొనసాగింది. ఉదయం చిత్ర యూనిట్ సభ్యులు శ్రీ లక్ష్మినరసింహస్వామి వారిని దర్శించుకున్న అనంతరం తూర్పు వాకిలి మెట్లపైన, శ్రీ ఉగ్రనరసింహస్వామి విగ్రహం తదితర ప్రదేశాల్లో బాల నటీనటులతో పలు సన్నివేషాలను చిత్రీకరించారు. నేడు, రేపు ఆమిద్యాల, రాకెట్ల గ్రామాల్లో రెండు రోజులపాటు పలు సన్నివేషాలు చిత్రీకరణ కొనసాగుతుందని చిత్రం యూనిట్ సభ్యులు తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై గోపీచంద్ మలినేని దర్శకత్వంలో నిర్మితమవుతున్న ఈ చిత్రంలో శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తుండగా బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి 80శాతం షూటింగ్ పూర్తికాగా మిగిలిన 20శాతం షూటింగ్‌ను ఈ ప్రాంతంలో పూర్తిచేసి వచ్చే సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్, పోస్టర్లు విడుదల చేయగా అభిమానుల్లో మంచి క్రేజ్ కనిపిస్తోంది. రాయలసీమ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి సాయిమాధవ్ బుర్రా మాటలు హైలెట్‌గా నిలువనున్నాయి. కాగా చిత్రం షూటింగ్ చూడటానికి బాలయ్య అభిమానులు పెద్దఎత్తున తరలివస్తున్నారు.

## ఆర్డీటీ బుద్ధిమాంద్యం పిల్లలకు ఉచిత కంటి పరీక్షలు

### -ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహణ



బుద్ధిమాంద్యం పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** పట్టణంలోని గుంతకల్లు రోడ్డులోగల ఆర్డీటీ ఫీల్డు కార్యాలయంలోని బుద్ధిమాంద్యం పాఠశాలలో పిల్లలకు బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్‌శాఖ, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ సంయుక్తంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించింది. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి జి.మోహన్‌కృష్ణ, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ కోఆర్డినేటర్ యండి.రఫీక్ ఆధ్వర్యంలో 60 మంది బుద్ధిమాంద్యం పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించి 8 మంది పిల్లలకు కంటి అద్దాలు అవసరమని గుర్తించి 15 మంది పిల్లల కళ్లల్లో ఇన్‌ఫెక్షన్ ఉందని డ్రాప్ అవసరమని గుర్తించిన వైద్య బృందం ఒకరిని శస్త్ర చికిత్సకై ఐ ఇన్స్టిట్యూట్‌కు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బాలబాలికల సంరక్షణ కేంద్రాల్లో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్ చేయించి అద్దాలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ బుద్ధిమాంద్యం సెంటర్ ఇంచార్జ్ జి.యోగానంద, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ బి.రమేష్, టెక్నీషియన్ కృష్ణ, ఆర్డీటీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గ క్రికెట్ జట్టు ఎంపిక

### -ముగిసిన జగనన్న క్రీడా సంబరాలు



ఎంపిక చేసిన క్రికెట్ టీంతో ఎంపిక కమిటీ సభ్యులు

**ఉరవకొండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** పట్టణంలోని ఎన్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత మూడు రోజులుగా జరుతున్న జగనన్న క్రీడా సంబరాల యువతీ యువకుల క్రీడాపోటీలు ముగిశాయి. పోటీల్లో భాగంగా బుధవారం క్రికెట్ క్రీడాపోటీలు నిర్వహించి ఉరవకొండ నియోజకవర్గ క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరన్న, క్రీడాపోటీల నియోజకవర్గ ఇంచార్జ్ వై.క్రిష్ణారెడ్డి, పీడీలు సి.మారుతీప్రసాద్, లత, రాజేష్, అష్రాఫ్ ముసేన్, ప్రభాకర్, సత్యనారాయణ, జిల్లా క్రీడల శిక్షకులు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ యల్లప్ప బాధ్యతలు స్వీకరణ



ఆసుపత్రిలో నిర్మాణాలను పరిశీలిస్తున్న దృశ్యం

**గుత్తి, నవంబర్ 9 ప్రభాతవార్త :** పట్టణంలోని వైద్యవిధాన పరిషత్ కమ్యూనిటీ వైద్యశాల సూపరింటెండెంట్‌గా బుధవారం జనరల్ సర్జన్ డాక్టర్ యల్లప్ప బాధ్యతలు స్వీకరించారు. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ హనీఫ్‌ను కర్నూల్ జిల్లా డోన్‌కు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో సీనియర్ వైద్యుడు అయిన డాక్టర్ యల్లప్పను ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి అభివృద్ధి పట్ల సమావేశం నిర్వహించారు. ప్రాంగణంలో నిర్మాణంలో వున్న లేబర్‌వార్డు నూతన భవన నిర్మాణాలను ఈ సందర్భంగా డాక్టర్‌తో పాటు అభివృద్ధి కమిటీ శాసనసభ్యుడు డాక్టర్ కృష్ణగోపాల్‌రెడ్డి, వైకాపా పట్టణ కన్వీనర్ హుసేన్‌పీరాలు పరిశీలించారు. రోగుల సేవల పట్ల తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్ సేవలను సద్వినియోగపర్చుకోవాలి - ఎడిజె కపర్ది



సమావేశంలో మాట్లాడుతున్న ఎడిజె

**గుత్తి, నవంబర్ 9 ప్రభాతవార్త :** అప్పీలకు అవకాశం లేని లోక్‌అదాలత్ ద్వారా రాజీకి సాధ్యపడే అన్ని కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలని అదనపు జిల్లా జడ్జి కపర్ది సూచించారు. జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని స్థానిక కోర్టు ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిజె మాట్లాడుతూ అరువ్లైన పేదలు న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయసేవలు పొందవచ్చని సూచించారు. ఈ కార్య క్రమంలో సీనియర్ సివిల్ జడ్జి తేజోవతి, జెఎఫ్‌సిఎం దీప్తి, గుత్తి, తాడిపత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మనోహర్ బాబు, ప్రతాప్‌రెడ్డి, ఏపిపి సుధీర్‌రెడ్డి, ఎజిపి తిమ్మారెడ్డి, సీనియర్ న్యాయవాదులు రమేష్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, సతీష్, మహేష్‌కుమార్, నవీన్, ఇస్మాయిల్, సుదర్శన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఓటర్లుగా 506 నమోదు

**అగళి, నవంబర్ 9 ప్రభాతవార్త :**

రాయలసీమ పశ్చిమ నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం ముగిసింది. ఇప్పటికే మండలంలో 506 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు తహశీల్దారు జీలాని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణులైన వారు డిప్లమో ఉత్తీర్ణులైన వారు నెల రోజులపాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకున్నారని తహశీల్దారు తెలిపారు. వీటి పరిశీలన కూడా పూర్తి అయిందన్నారు.

## విద్యుత్ స్తంభాలు పూర్తి నేలకొరిగినా పట్టించుకోని అధికారులు

### - పలు గ్రామాల్లో విద్యుత్ మీటర్లు అగ్నికి ఆహుతి
### - నిర్లక్ష్య దోరణిలో అధికారులు



వాలిన విద్యుత్ స్తంభం



కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వున్న కంపచెట్లు

**గోరంట్ల, నవంబర్ 9 ప్రభాతవార్త :** గత రెండేళ్లుగా భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు నేల కొరిగినా ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు భారీగా వినిపిస్తున్నాయి. అదేవిధంగా ఉమ్మడి అనంతపురం జిల్లా తాడిమర్రి మండలం చిల్లకొండాయపల్లి సమీపంలో జూన్ 30న విద్యుత్ తీగ తెగి ఆటోపై పడి 6 మంది మహిళా కూలీలు సజీవ దహనం అయ్యారు. ఈ ఘోర సంఘటన మరువకముందే బొమ్మనహాల్ మండలంలో నలుగురు కూలీలు విద్యుత్ తీగకు గురి కాగా ఇలాంటి హృదయవిదార ఘటనలు ఉమ్మడి జిల్లాలో తరుచూ జరుగుతూనే వున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మండలంలో ఎక్కడ చూసినా వర్షానికి విద్యుత్ స్తంభాలు వాలిపోతూ ఎప్పుడు పడతాయోనన్న విధంగా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అదేవిధంగా మండలంలోని రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా లేనప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి చూడాలంటే ఎక్కడ చూసినా తీగలతో చుట్టు ముట్టి విద్యుత్ తీగలు నేలకొరిగిన విద్యుత్ స్తంభం ఎప్పుడు నేలకొరుగుతుందో విద్యుత్ తీగలు వేలాడుతూ గాలివీచినప్పుడు పెన వేసుకుంటాయోనని రైతులు భయంతో వణికిపోతున్న సందర్భాలు ఎన్నో వున్నాయి. గౌనివారిపల్లిలో ఓ ఇంటిలో విద్యుత్ మీటర్ పూర్తి కాలి బూడిద కాగా విద్యుత్ వైర్లు అర్తు అయి కాలిపోయిందని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కొత్త మీటర్‌కు డబ్బులు కట్టించుకున్నారని గ్రామాల్లో పలు చోట్ల విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో గృహాలపైన ప్రధాన లైన్లు వున్నా మార్పు చేయడంలేదు. ప్రజలు ఎవరైనా గట్టిగా నిలదీస్తే ఉడతా భక్తిగా తాత్కాలిక పనులు చేసి వదిలేస్తున్నారని ఉడత ఊపులకే తెగే విధంగా వుంటే భారీ వర్షానికి ఎక్కువగా గాలి వీస్తే ఏమి జరుగుతుందోనని విద్యుత్ కనెక్షన్ తీసుకున్న రైతు పొలాల్లో స్తంభాలు ఏర్పాట్లు చూసుకోవాలంటే స్తంభాలు రైతులే వాహనాల్లో తరలించుకోవాల్సి వస్తుందని తరలించే సమయంలో అజా గ్రత్తల వల్ల వాహనాలు తిరగబడి పలువురు మృత్యువాత పడిన సంఘటనలు వున్నాయని, బూదిలి పంచాయతీ కాగానిపల్లి వద్ద విద్యుత్ స్తంభం నేలకు పడిపోయే రీతిలో వున్నా కూడా ఏమాత్రం పట్టించుకోని పాపానపోలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మండల పరిధిలోని కమ్మవారిపల్లి పంచాయతీలో ఎర్రయ్యగారిపల్లి వద్ద రోడ్డు పక్కనే చేతికందే విధంగా విద్యుత్ తీగలు, చొండూరువాండ్లపల్లి వద్ద ఎగువ గంగంపల్లికి వెళ్లే దారిలో వున్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు కంప చెట్లు అల్లుకున్న దృశ్యం కనపడుతుంది. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు కిందకు అందడం, ట్రాన్స్‌ఫార్మర్లు కంపచెట్లలో వుండడం, గ్రామాల్లో, పట్టణాల్లో విద్యుత్ తీగలు వెలాడుతూ గాలి వీస్తే పెనవేసుకునేటట్లుగా వున్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఏళ్ల నాటి నుండి విద్యుత్ తీగలను మార్పు చేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చిమొక్కలు కంపచెట్లు పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా వున్నాయని ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి తొలగించే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## గుత్తేదారు రవికుమార్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

వార్త ప్రభావం





వార్తలో ప్రచురితమైన కథనం

**గుడిబండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కేంద్రంలో సిమెంట్ బస్తాలు అన్న కథనానికి ఐసిడిఎస్ సిబ్బంది, అధికారులు స్పందించారు. గుడిబండ మండల పరిధిలో రాళ్లపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా అధికార పార్టీకి చెందిన నాయకులు వివిధ నిర్మాణాలకు ఉపయోగించి సిమెంట్ బస్తాలను అంగన్‌వాడీ కేంద్రంగానిల్వ చేస్తున్నారు. ఈ క్రమంలో సిమెంట్ బస్తాలను తీయాలని చిన్న పిల్లలుచాలా ఇబ్బందులు పడుతున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు ఎన్నిసార్లు చెప్పినా వినకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం వార్త పత్రికలో ప్రచురించిన అంగన్‌వాడీ కేంద్రంలో సిమెంట్ బస్తాలు అన్న కథనానికి ఐసిడిఎస్ అధికారులు స్పందించి బుధవారం స్థానిక సర్పంచు లక్ష్మినారాయణ, గుత్తేదారు రవికుమార్‌పై గుడిబండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ స్పందిస్తూ త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఉన్నత పాఠశాల కమిటీ ఛైర్మన్‌గా రాజు

### - మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన సర్పంచు



ఉన్నత పాఠశాల కమిటీ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**గుడిబండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక సర్పంచు కరుణాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో పాఠశాల కమిటీని విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎంసి ఛైర్మన్ ఎన్.రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తదనంతరం సర్పంచు కరుణాకర్‌గౌడ్, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అలాగే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిచంద్రకుమార్, ఉపాధ్యాయులు ఆజాద్, రామకృష్ణ, శ్రీలత, సాయికృష్ణ, నరసింహమూర్తి, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఆర్ నాగరాజు, పెట్రోల్ బంక్ తిప్పేస్వామి, ఫళారం ఉమేష , రంగప్ప, గుడ్డదహల్లి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ మంజునాథ్, భోజరాజు తదితరులు పాల్గొన్నారు.

## 13 రోజు కొనసాగిన శ్రీ సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికుల సమ్మె

**ఉరవకొండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** వివిధ డిమాండ్ల సాధనకై శ్రీ సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 13వ రోజు కొనసాగింది. కూడేరు మండలం కొర్రకోడు గ్రామంలోని పీఏబీఆర్ శ్రీ సత్యసాయి మంచినీటి పథకం పంప్‌హౌస్‌వద్ద కార్మికులు నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఎల్‌అండ్‌టీ ఇవ్వవలసిన గ్రాట్యుటీ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తక్షణమే చెల్లించాలన్నారు. బోర్డు వారు గుర్తింపు (ఐడి) ఇయస్ఐ వెంటనే చెల్లించాలని, అవకతవకలు ఉన్న పీఎఫ్, ఇయస్ఐ వెంటనే సరిచేయాలని కోరారు. 2021 జూలై 6 నుంచి బోర్డు ఇవ్వాల్సిన బోనస్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వాలని, 3నెలల బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని తదితర తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంతవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## బోయలు, వడ్డెర్లను ఎస్‌టి జాబితాలో చేర్చరాదు

### -రాష్ట్ర ప్రభుత్వం 52 జిఒ రద్దు పరచాలి -14న సత్యసాయి జిల్లా కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేద్దాం -బంజారా నాయకులు



నినాదాలు చేస్తున్న బంజారా నాయకులు

**గోరంట్ల, నవంబర్ 9 ప్రభాతవార్త :** రాష్ట్రంలో వున్న వడ్డెర్లు, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 52 జిఒను అమలు చేయడం గిరిజనులకు శాపంగా మారిందని వెంటనే జిఒను రద్దు చేసి ఎస్‌టి జాబితాలోకి చేర్చడాన్ని ఉపసంహరించుకోవాలని గోరంట్ల పట్టణంలోని శ్రీసరస్వతి విద్యామందిరంలో బంజారా సంఘాల నాయకులు బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వడెర్లు, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చితే 35 తెగల 38 లక్షల జనాభా వున్న బంజారా జాతి తీవ్రంగా నష్టపోవడమే కాకుండా పూరి_గా అణచివేతకు గురవుతారని వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుగాలీల అభివృద్ధికి కృషి చేయాలని మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్న ఉద్దేశ్యంతో ఈ నెల 14వతేదీ జిల్లాలోని అన్ని తాండాల గిరిజనులు కలిసి శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ ముట్టడితో పాటు మహాప్రదర్శన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని గిరిజనులు విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 52 జిఒను రద్దు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ తిప్పానాయక్, సర్పంచు సరోజానాగేనాయక్, రమారంగనాయక్, వాసుదేవనాయక్, మాజీ సర్పంచు రవినాయక్, హరిబాబునాయక్, మురళినాయక్, బాబునాయక్, రిటైర్డ్ ఉపాధ్యాయులు గనేనాయక్, బంజారా సంఘం జెఎసి నాయకులు మహేష్‌నాయక్, ముఖ్య కాలేనాయక్, బంజారా కృష్ణానాయక్, నల్లమాడ ఎంపిపి ఆంజనేయులునాయక్, రమేష్‌నాయక్, బాబునాయక్, శంకర్‌నాయక్, మండలంలోని బంజారా కులస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఉర్దూ దినోత్సవము



బహుమతులు అందచేస్తున్న దృశ్యం

**గోరంట్ల, నవంబర్ 9 ప్రభాతవార్త :** ఉర్దూ పాఠశాలలో ప్రపంచ ఉర్దూ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకవి డాక్టర్ అల్లామాఇక్బాల్ జయంతి రోజున ఉర్దూ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు ఉర్దూ ఉపాధ్యాయులు ఫెరోజ్‌అహ్మద్ (ఏపి రాష్ట్ర ఉపాధ్యక్షులు) తెలిపారు. ఉర్దూ భాష ప్రఖ్యాతిభాష, మాధురత్వాన్ని మరియు మహమ్మద్‌ఇక్బాల్ కవిత్వం గురించి ఆయన ఇచ్చిన సందేశాలల్లో మానవులకు జన్మ యొక్క ఉద్దేశ్యము, ప్రాముఖ్యత మరియు భాషకి తోనిచ్చిన అభివృద్ధి, సుగమార్గము గురించి చాటి చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు దివాకర్‌రెడ్డి ఇక్బాల్ యొక్క చదువు జీవితము మరియు కవిత్వాల గురించి మనం ఎంతో నేర్చుకోవాడానికి ఆయన ఆదర్శమని కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయులు ఫజలెకరం, జయసింహారావు, పరానా, ఆమిన, పావడ్ పాల్గొని ఉర్దూ భాష దినోత్సవం మరియు ఇక్బాల్ కవిత్వం గురించి కొనియాడారు. పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు కార్యక్రమంలో దుర్గా పాల్గొని విశ్వకవి గేయాలు, జీవిత చరిత్ర గురించి ప్రసంగించారు. అదేవిధంగా విద్యార్థులకు ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

## శ్రీవారిని దర్శించుకున్న వీరసింహారెడ్డి సినిమా డైరెక్టర్

### -సన్మానించి జ్ఞాపికను అందించిన ఆలయ కార్యనిర్వహణ అధికారి



డైరెక్టర్ గోపీచంద్ మలినేనికు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈఓ విజయ్‌కుమార్

**ఉరవకొండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** నందమూరి బాలకృష్ణ 107 చిత్రం వీరసింహారెడ్డి సినిమా డైరెక్టర్ గోపీచంద్ మలినేని బుధవారం ఉదయం మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం శ్రీ లక్ష్మినరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి ఆయన శ్రీవారిని దర్శించుకొని ఆకుపూజ, అర్చనలు చేయించారు. దీంతో ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయ్‌కుమార్ ఆయన్ను శాలువాకప్పి సన్మానించి ప్రసాదంతోపాటు శ్రీవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ అశోక్‌కుమార్, అర్చకులు ద్వారకనాథాచార్యులు, టీడీపీ నాయకులు మదమంచి శ్రీనివాసులు, వైసీపీ నాయకుడు ఆమిద్యాల రాజేష్ తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు

### -కొనకొండ్లలో అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవనాల నిర్మాణానికి భూమిపూజలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



అండన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి భూమిపూజ చేస్తునన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

**ఉరవకొండ, నవంబర్ 9 ప్రభాతవార్త :** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి అన్నిరకాల చర్యలు చేపడుతూ పిల్లలు, గర్భవతులు, బాలింతలు, కిషోర బాలికలను పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పేర్కొన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో 6,9,10 అండన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణానికి ఆయన అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కొక్క అంగన్‌వాడీ కేంద్రానికి 16 లక్షల రూపాయల చొప్పున నిధులు అందిస్తోందన్నారు. పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు తరహాలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అమలు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందిరమ్మ, మండల ఇంజనీర్ మంజునాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఎంపీటీసీ పాపన్న, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ యం.వి.రమణయాదవ్, మాజీ ఎంపీపీ రామచంద్ర, గ్రామ పెద్దలు ముద్దయ్య, మునయ్య, వైసీపీ నాయకులు లాలెప్ప, గురు ప్రసాద్, గురు, అంజి, హనుమంతు, గోపాల్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిను సన్మానిస్తున్న దృశ్యం

## రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

- జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్ఓ

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 9, ప్రభాతవార్త**

ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తు_న్న రేషన్ సరుకుల పంపిణీలో స్టోర్ డీలర్లు, ఎండియూ ఆపరేటర్లు అవకతవకలకు పాల్పడితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని నల్లగుట్లపల్లి, ఓడీచెరువులో ఇటీవల రేషన్ సరఫరాలో జరుగుతున్న అవకతవకలపై, పంపిణీలో డీలర్ల నిర్లక్ష్య దోరణి తదితర విషయాలపై వినియోగదారుల నుండి వచ్చిన ఫిర్యాదుల మేరకు డిఎస్ఓ సంబంధిత రేషన్ షాపులను బుధవారం తనిఖీ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నల్లగుట్లపల్లి చౌకదుకాణంలో గతనెలలో రేషన్ పంపిణీ చేయకపోవడానికి కారణాలను తెలుసుకున్నామన్నారు. నెట్‌వర్క్, సర్వర్ పనితీరులో జరుగుతున్న సాంకేతిక సమస్యల వల్ల సకాలంలో రేషన్ పంపిణీలో అంతరాయం కలుగుతోందన్నారు. నవంబర్ నెలకుగాను ప్రతి ఒక్క లబ్ధిదారునికి బియ్యం ఇవ్వాలని డీలర్‌కు ఆదేశాలు జారీచేశామన్నారు. డిసెంబర్ నుంచి రాగులు, కందిబేడలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏరా_ట్లు చేసిందన్నారు. గ్యాస్ వినియోగదారులు భద్రత భీమా కోసం రూ 236 చెల్లించి పాలసీ పొందాలన్నారు. గ్యాస్ వినియోగదారుల నుంచి అదనంగా రవాణా చార్జీలు వసూలు చేస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 8247475079కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ శ్రీధర్, సిఎస్‌డిటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో ఉపాధి పనులు విరివిగా కల్పించాలి

- ఎంపిడిఓ పోలప్ప



రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్, ఎంపిడిఓ

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 9, ప్రభాతవార్త**

మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి పనులు విరివిగా కల్పించాలని ఎంపిడిఓ పోలప్ప ఉపాధి హామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తంగేడుకుంట, కొండకమర్ల పంచాయితీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం కింద పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పిస్తామని వారికి అవగాహ కలిగించాలని ఇందుకు క్షేత్రసహాయకులు, మేట్లు ప్రేత్యక చొరవ చూపి ఉపాధి పనులకు వచ్చేలా అవగాహన కలిగించాలన్నారు. రోజు వారి కూలీ గరిష్టంగా రూ 257 వచ్చే విధంగా వారితో పనిచేయించాలన్నారు. కొండకమర్ల పంచాయితీ పరిధిలో నాయనాకోట తాండా నుండి కుటాలపల్లి వరకూ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కొందరు తమ భూమిలో రోడ్డు పనులు చేయవద్దని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఓలు రైతులతో మాట్లాడి ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న రహదారి పనులు అడ్డుకోవద్దని సహకరించాలని రైతులకు నచ్చచెప్పి రోడ్డు పనులు పున:ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ సోమశేఖర్‌రెడ్డి, సాంకేతిక సహయకులు రాజారెడ్డి, రాజేంద్ర, క్షేత్ర సహయకులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్య పరిష్కారం

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 9, ప్రభాతవార్త**



రిగ్గు యంత్రానికి పూజలు నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

మండల పరిధిలోని తంగేదు కుంట పంచాయితీ పరిధి బుచ్చి రాజుపల్లిలో గత కొన్ని రోజులుగా ప్రజలు త్రాగునీటి కొరకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ అబిదాభాను, ఎంపిటిసి రమణ య్య, వైసిపి నాయకులు భారతి సిమెంట్ రఫీలు ఎమ్మెల్యే దుద్దు కుంట శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో ఎమ్మెల్యే హుటాహుటిన స్పందించి కొత్త బోరుబావి వేయించి త్రాగునీటి సమస్య ప రి ష్క రి ం చా ల ని అధికారులను ఆదేశించారు. ఇందులో బాగంగా బుధవారం ఎంపిడిఓ పోలప్ప, స్థానిక నాయకులు రిగ్గుయంత్రానికి పూజలు చేసి కొత్తబోరు వేయించారు. దీంతో గ్రామస్తులు త్రాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, స్థానిక వైసిపి నాయకులకుప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సనత్‌స్వామి, పంచాయితీ కార్యదర్శి రామలింగారెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## గర్బవతులకు అన్నదానం

- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వజ్రబాస్కర్‌రెడ్డి



అన్నదాన కార్యక్రమంలో గర్బవతులకు బోజనం వడ్డిస్తున్న వజ్రబాస్కర్‌రెడ్డి

**తలుపుల,నవంబర్09,ప్రభాతవార్త**

మండల మారుమూల ప్రాంతాల నుంచి ప్రతినెల 9వ తేదీ నిర్వహించే ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో బాగంగా నిర్వహించే పరీక్షలకు వచ్చు గర్బవతులకు ఉపాధ్యాయుడు గంగిశెట్టి ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా అధ్యక్షులు వజ్రబాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి బృహత్తర కార్యక్రమం ఉపాధ్యాయుడు గంగిశెట్టి చేపట్టడం ఎంతో సంతోషదాయకమన్నారు. అదే విదంగా గర్బవతులకు నిర్వహించే పరీక్షల్లో 101మందికి వైద్యుడు మున్వర్‌బాష వైద్య పరీక్షలు నిర్వహించారు. హై రిస్క్ ఉన్న గర్బవతులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కొరకు కదిరికి పంపడం జరిగింది.

## జాతీయ క్రీడా స్థాయి పోటీల్లో సత్తా చాటిన శ్రీ విజ్ఞాన్ విద్యార్థులు



విద్యార్థులను అబినందిస్తున్న ఎంఈఓ, కరస్పాండెంట్

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 9, ప్రభాతవార్త**

నేషనల్ యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గోవా రాజధాని ఫనాజీలో జరిగిన వివిధ క్రీడా పోటీలలో ఓబుళదేవరచెరువు మండలం శ్రీ విజ్ఞాన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటి మండలానికే వన్నె తెచ్చారు. ఈ నెల 5, 6, 7వ తేదీలలో వివిధ విభాగాలలో నిర్వహించిన క్రీడలలో జాతీయ స్థాయిలో చాంపియన్ షిప్ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచి తమ ప్రతిభను చాటారు. అండర్-14 బాలుర విభాగంలో కబడ్డీ, కోకో క్రీడలలో మొదటి స్థానం అండర్-17 బాలుర విభాగం కబడ్డీలో విన్నర్స్‌గా నిలిచారు. అండర్-14 షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో సైతం 9వ తరగతి విద్యార్థిని స్పందన, అండర్-17లో 200 మీటర్ల పరుగు పందెంలో విభాగంలో రితీషా విన్నర్‌గా నిలిచింది. శ్రీ విజ్ఞాన్ పాఠశాలకు చెందిన దాదాపు 40 మంది విద్యార్థులకు పైగా గోవాలో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొనడం విశేషం. జాతీయస్థాయిలో ప్రశంశా పత్రాలు మెడల్స్‌ను తీసుకురావడం పాఠశాలకేకాక మండలానికే గర్వకారణంగా విద్యార్థులు నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణంలో విజయోత్స వ సంబరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీ విజ్ఞాన్ పాఠశాలల అధినేత కట్టుబడి మస్తాన్ ఆధ్వర్యంలో అభినందన సభను నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ ఖాదర్‌వలిబాషతో పాటు పీడిలు రాము, సాదిక్, మంజుభార్గవి, మేనేజర్ మహేష్‌లు హాజరై విద్యార్థిని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కరసా ్పం డెంట్ మస్తాన్ మాట్లాడుతూ తమ పాఠశాలలో మెరుగైన విద్యాప్రమాణాలతో పాటు క్రీడలలో ప్రతిభ ఉన్నవారిని వెలికితీసి వారికి మరింత మెరుగైన శిక్షణ అందించి తీర్చిదిద్దుతున్నామన్నారు. క్రీడలలో విశేషంగా రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిస్తే వారికి తప్పక ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పవర్గీస్, అకడమిక్ డైరెక్టర్ ఫరియాజ్, అకడమిక్ అడ్వజర్ సమీ ఉన్నిసా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంబరాలు జరుపుకున్న సచివాలయం సిబ్బంది



కేక్ కట్ చేస్తున్న సచివాలయం సిబ్బంది

**అమడగూరు, నవంబర్ 9 ప్రభాతవార్త**

సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు ఇవ్వడం పట్ల సచివాలయం సిబ్బంది బుధవారం సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి గజ్జల ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 10 సచివాలయాల సిబ్బంది థ్యాంక్యూ ముఖ్యమంత్రి సార్ అంటూ కేక్ కట్ చేసి అధికారులకు పంచిపెట్టారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వ ఉద్యోగులుగా అవకాశం కల్పించడంతో మాకు చాలా సంతోషంగా వుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ షేక్‌నసీమా, కన్వీనర్ సూరిరెడ్డి, సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, షబ్బీర్, సురేంద్రరెడ్డి, ఆదినారాయణ, శంకర, ఎంపిటిసిలు పెద్దప్పయ్య, శ్రీరాములు, నారాయణ, వివిధ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిపిని కలిసిన కన్వీనర్ సూరిరెడ్డి



ఎంపిపితో కన్వీనర్ సూరిరెడ్డి

**అమడగూరు, నవంబర్ 9 ప్రభాతవార్త**

ఇటీవల నూతనంగా ఎంపికైన వైసిపి మండల కన్వీనర్ మెడికల్‌స్టోర్ సూరిరెడ్డి బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి గజ్జల ప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపిపి కన్వీనర్‌కు అభినందనలు తెలుపుతూ మండలాన్ని ఏకతాటిపైకి తీసుకరావాలని వర్గ విభేదాలకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని ప్రతి ఒక్కరిని రాజకీయాలకు అతీతంగా సమానంగా చూసుకోవాలని ఎంపిపి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు షబ్బీర్, శ్రీధర్‌రెడ్డి, ఆదినారాయణ, సురేందర్‌రెడ్డి, ఐకెపి ఆంజనేయలు, ఎంపిటిసి పెద్దప్పయ్య, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాక్షరత అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడిసిసి బ్యాంక్ మేనేజర్

**తనకల్లు, నవంబర్ 9, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో ఆర్థిక సాక్షరత అవగాహన సదస్సు బుధవారం ఎడిసిసి బ్యాంగ్ కార్యాలయంలో నిర్వహించినట్లు ఏడిసిసి బ్యాంక్ మేనేజర్ మహాలక్ష్మీ తెలిపారు. మండలంలోని రైతులు, ప్రజలు, ఖాతాధారులు, మహిళా సంఘాల గ్రూపులు ప్రతి ఒక్కరూ బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని రైతులకు పట్టాదారు పాసుపుస్తకంపై రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. బంగారు రుణాలపై వడ్డీ కూడా మా బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీకే బంగారు లోన్లు మంజూరు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మహిళా సంఘాల గ్రూపులకు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ తెలిపారు. బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## పట్టుబడిన వాహనాలు బహిరంగ వేలం

**తనకల్లు, నవంబర్ 9, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సబ్) స్టేషన్ నందు 11.11.2022 తేదిన ఉదయం 10:30 గంటలకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూరిండెంట్ యస్.రవికుమార్, పుట్టపర్తి వారి సమక్షంలో గతంలో పట్టుబడిన 15 వాహలను వేలం వేయబడును. కావున ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనదలచిందిగా మనవి. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఆధార్‌కార్డు జిరాక్స్ తమ వెంట తీసుకొనిరావలెలెని సెబ్ సిఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు.

## పెద్దపప్పూరు ప్రభుత్వాసుపత్రికి ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కళ్యాణ్‌కుమార్

**పెద్దపప్పూరు, నవంబర్ 9 ప్రభాతవార్త**

పెద్దపప్పూరు ప్రభుత్వాసుపత్రికి ఉత్తమ అవార్డు లభించింది. 2020-21 సంవత్సరానికి గాను కల్పకాయ అవార్డు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ ప్రోగ్రాం కింద అవార్డు లభించినట్లు డాక్టర్ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. పెద్దపప్పూరు ప్రభుత్వాసుపత్రికి అవార్డు రావడం పట్ల బుధవారం వైద్యులకు, వైద్యసిబ్బందికి మండల ప్రజాప్రతినిధులు, మేధావులు, ఆయా శాఖల అధికారులు అభినందనలు తెలిపారు.

## కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటా

-జెసి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిరూరల్, నవంబర్ 9 ప్రభాతవార్త**



కంబయ్యను పరామర్శిస్తున్న జెసి అశ్మిత్‌రెడ్డి

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా వుంటానని ఆ పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్ చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి పేర్కొ న్నారు. మండలంలోని సజ్జల దిన్నె గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త తలారి కంబయ్య గత కొన్ని రోజుల క్రితం బైకు అదుపుతప్పి కింద పడ్డాడు. విషయం తెలుసుకున్న అశ్మిత్‌రెడ్డి బుధవారం సజ్జలదిన్నె గ్రామం లోని కంబయ్య నివాసానికి చేరుకుని పరామర్శించారు. అనంతరం గ్రామంలో పర్యటిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి కార్యకర్తలకు ఏ సమస ్య వచ్చినా అండగా వుంటామని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్య క్రమంలో టిడిపి నాయకులు ఒంటెద్దు కేశవరెడ్డి, ఒంటెద్దు రాజగోపాల్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీధులు శుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధులు దరిచేరవు



సమస్యలు తెలుసుకుంటున్న జెసి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 9 ప్రభాతవార్త**

వీధులు శుభ్రంగా వుంటే సీజనల్ వ్యాధులు దరిచేరవని తెలుగుదేశం పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని ఓంశాంతినగర్, ఇందిరానగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు వీధులను శుభ్రంగా వుంచుకోవాలన్నారు. అంతేకాకుండా సీజనల్ వ్యాధులకు దూరంగా వుండాలని ఆయన ప్రజలకు తెలియచేశారు. ఈ కార్య క్రమంలో కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, జె.సి అనుచరులు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఓటరుగా నమోదు చేసుకోవాలి

**మడకశిర, నవంబర్ 9, ప్రభాతవార్త**



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నియోజకవర్గ పరిధిలోని 18 సంవత్సరాలు పూర్తి అయిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారి డిప్యూటి తహశీల్దార్ మారుతీ ప్రసాద్ మరియు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మధుసూదనరావు బుధవారం మడకశిర మండలం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్వీప్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణను విడుదల చేసిన నేపథ్యంలో ఓటరు జాబితాకు ఏమైనా అభ్యంతరాలు, తప్పుగా ఉన్న పేర్లు, చిరునామాలు ఇతర విషయాలను సవరణ చేసుకునేందుకు వెసలుబాటు ఉందని తెలిపారు. అలాగే నూతన ఓటర్ల నమోదు ఫారం-6, ఓటరు జాబితా నుండి పేరు తొలగింపునకు ఫారం 7, నివాస మార్పుకొరకు ఫారం 8 మరియు ఫారం 6ఎ ను ఎన్ఆర్ఐలు, ఆధార్ అనుసంధానానికి ఫారం 6బి కూడా ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని, మండలంలో ఏర్పాటుచేసిన బిఎల్ఓ ద్వారా, లేదా ఆన్‌లైన్ ఎన్‌విఎస్‌పి పోర్టల్ ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా గత రెండు మాసాలలో సవరించిన ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితాను రూపొందించారు. ఈ కార్యక్రమంలో మడకశిర మండలానికి సంబంధించిన సూపర్‌వైజర్లు మరియు బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రూ. 5లక్షలు చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

**నంబులపూలకుంట, నవంబర్ 9, ప్రభాతవార్త:**

మండలంలో ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో రెడ్డెప్ప రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబానికి ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి రూ. 5లక్షల రూపాయల చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్యపడవద్దని అండగా ఉంటామని, ఎటువంటి సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు విద్యుత్ శాఖ ఏడిఈ, డిఈ,ఏఈ, ఎంపిపి రాము, వైస్ ఎంపిపి కేశవరెడ్డి, సర్పంచ్ శ్రీరాములు, ఎంపిటిసి షామీర్‌బాషా, కోప్షన్ సుబహాన్, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మెన్ రాఘవయ్య, టీచర్ రామచంద్రారెడ్డి, ఎక్స్ ఎంపిపి పుల్లారెడ్డి, వాటర్ సెట్ చైర్మెన్ బయ్యారెడ్డి, సర్పంచ్ తిరుమలప్ప నాయుడు, తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హౌసింగ్ నిర్మాణం పనులు వేగవంతం చేయండి

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 9, ప్రభాతవార్త**

హౌసింగ్ మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలని ఎంపిడిఓ పోలప్ప లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని తంగేడుకుంట పంచాయితీ యర్రబల్లి గ్రామంలో హౌసింగ్ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ హౌసింగ్ నిర్మాణాలు త్వరితగతన చేపట్టాలని కోరారు. బిల్లుల్లో ఎటువంటి జాప్యం లేకుండా బిల్లులు మంజూరు చేయిస్తామన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఇల్లు నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులకు అవగాహన కలిగించాలన్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పథకం గురించి అరా తీశారు. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా లేదానని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

## సమస్యలు తెలుసుకున్న జె.సి

**తాడిపత్రిఅర్బన్, నవంబర్ 9 ప్రభాతవార్త**



కార్యాలయానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న జె.సి

వివిధ పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారులను బుధ వారం మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆప్యాయంగా పలుకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చే వారి పనులు త్వరితగతిన పూర్త య్యేలా చూడాలని ఆయన అధికారులు, సిబ్బందికి సూచిం చారు. పలు సమస్యలు, పనుల మీద వచ్చిన వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలని ఆయా విభాగాల అధికారులకు జె.సి సూచించారు. జె.సి వెంట పలువురు కౌన్సిలర్లు వున్నారు.

## ఎస్‌బిఐ ఖాతాలో డబ్బులు గోవింద

- ఇది సైబర్ నేరగాళ్ల పని

**యాడికి, నవంబర్ 9 ప్రభాతవార్త**



బ్యాంకు అధికారితో మాట్లాడుతున్న హుసేన్

మండలంలోని రాయలచెరువు ఎస్‌బిఐలో సైబర్‌నేరగాళ్లు రోజురోజుకు రెచ్చిపోతూ ఖాతాదారుల ఖాతాల నుండి డబ్బులు కొల్లగొడుతున్నారు. సాధారణంగా సంపదకు రక్షణ నిలయంగా బ్యాంకులకు పెట్టింది పేరు. అలాంటి బ్యాంకు ఖాతా నుండే ఖాతాదారులకు తెలియకుండా సైబర్ నేరగాళ్లు డబ్బు గుటకాయ స్వాహా చేస్తున్నారు. రాయలచెరువు గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న షేక్ హుసేన్ అనే ఖాతాదారుడు పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి ఖర్చుల కొరకు బ్యాంకులో దాచుకున్న సొమ్మును గత నెల 25న 10 వేల రూపాయలు, ఈ నెల 5న 10 వేల రూపాయలు మాయమయ్యాయని సమాచారం బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా ఇలా చాలా మందివి పోయాయని ఇది సైబర్ నేరగాళ్ల పని అని దీనికి మేము ఏమి చేయలేమని చేతులెత్తేయడం విశేషం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సైబర్‌నేరగాళ్లపై నిఘా వుంచి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

## ఓటిఎస్ పై వస్తున్న అపోహలను నమ్మవద్దు

**అనంతపురం రూరల్, నవంబర్09ప్రభాతవార్త:**



ఓటిఎస్ రిజిస్టేషన్ పత్రాలు అందిస్తున్న దృశ్యం

రాష్ట్రంలోని పేద ప్రజల కోసం జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకాంపై వస్తున్న అపోహలను ఎవరు నమ్మవద్దన్ని ఈ పథకంను గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ సద్వినియోగంచేనుకోవాలి ఉప్పరపల్లి గ్రామ సర్పంచ్ సావిత్రీ శ్రీనివాసులు. పంచాయితీ కార్యదర్శి ప్రేమ్ కుమార్ తెలిపారు. బుధవారం అనంత రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామం లో ఓటిఎస్ పత్రాలను లబ్దిదారులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూరాష్ట్రంలోని పేద ప్రజల కోసం జగనన్న ప్రభుత్వం తీసు కొచ్చిన జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంపై వస్తున్న అపోహలను ఎవరు నమ్మకుండాఈ పథకం చాలా మంచి పథకమని ఈ పథకాన్ని గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ వీటి గురించి తెలుసుకుని ఓటిఎస్ అమౌంట్‌ను కట్టి మీ ఇంటికి రిజిస్ట్రేషన్ హక్కును సాధించుకోవచ్చాన్నారు. కావున ఈ పథకంను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగదు చెల్లించిన 15 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, వైకాపా నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటర్లీ పాల్గొన్నారు.

## సచివాలయాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

**అనంతపురం రూరల్, నవంబర్ 09 ప్రభాతవార్త**



సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అనంత రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామంలో నిర్మిస్తున్న సచివాలయ, ఆర్‌బికే, భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపిడిఓ బాబా ఫకృద్దీన్ తెలిపారు. బుధవారం అనంత రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ, ఆర్‌బికే భవనాలను జెఈ శ్రీనివాసరెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాల నిర్మాణ పనులలో ఎటువంటి జాప్యం వహించకుండా వెంటనే పనులు పురోగతిలోకి తీసుకురావాలని అందుకు పంచాయితీ కార్యదర్శులు, సర్పంచులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, కాంట్రాక్టర్ల కృషి చేసి భవన నిర్మిణాలు త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసి సోమశేఖర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి రమాదేవి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తోలుతున్న ట్రాక్టర్లు సీజ్

**అగళి, నవంబర్ 9 ప్రభాతవార్త**



సీజ్ చేసిన ట్రాక్టర్‌లు

మండల పరిధిలోని హనుమనపల్లి వంక నుంచి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తోలుతున్న సమయంలో ఎస్ఐ లావణ్య, సిబ్బంది ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. పులమగట్ట గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప ఈ అక్రమ ఇసుక రవాణా చేస్తున్నట్లు ట్రాక్టర్లను సీజ్ చేసిన అనంతరం అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రెండు ట్రాలీలు, ఒక ఇంజన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లకు నెంబర్ ప్లేట్లు కానీ, ఎలాంటివి లేవని వాటిని ఇంత వరకు సదరు నింధితుడు పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాలేదన్నారు. హనుమనపల్లి వంక నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్న విషయం సమాచారం అందడంతో ఎస్ఐ లావణ్య సిబ్బంది మెరుపు దాడి చేసి నిన్న అర్ధరాత్రి 12 గంటల సమయం దాటిన అనంతరం పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుక అక్రమరవాణాకు పాల్పడే వారు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ తెలిపారు. అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడే వారు, అక్రమ మద్యం, పేకాట, ఆన్‌లైన్ గేమింగ్, ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## నవరత్నాలు పేదలందరికీ ఇల్లు

**నంబులపూలకుంట, నవంబర్ 9, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ఎంపిపి చాంబర్‌లో నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా ఎంపిపి రాము అధ్యక్షతన ఎంపిడిఓ ఆదినారాయణ ఆధ్వర్యంలో మండలంలోని వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టె ంట్ మరియు గ్రామ రెవెన్యూ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవర్నాతలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో ప్రతి ఒక్క అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి న్యాయం జరిగే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సుబహాన్, నాయకులు తిరుమల నాయుడు, హౌసింగ్ ఏఈ శ్రావణి, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

